సాక్షి విశాఖపట్నం

బుధవారం ၊ 16 ၊ అక్టోబర్ ၊ 2024



ఈక్విటీకి వెళ్లిపోతాం..!

మూడేళ్లు లాభాల బాటపట్టిన డీసీఐఎల్ ఈ ఆర్థికంలో తొలి త్రైమాసికంలోనే ఏకంగా రూ.30 కోట్ల నష్టాల బారినపడింది. 10లో



పెద్దాస్పత్రికి నిర్లక్ష్య జబ్బు

ఉత్తరాంధ్రకు పెద్ద దిక్కుగా ఉన్న కేజీహెచ్‌లో సిబ్బంది నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. 10లో



కురిసింది వాన 10లో

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం నగరంలోని పలు చోట్ల వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ప్రొఫెసర్ సాయిబాబాది కేంద్ర ప్రభుత్వ హత్యే..!



గీతాలు ఆలపిస్తున్న ప్రజాగాయకుడు దేవిశ్రీ

సీతమ్మధార: మానవ హక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ సాయిబాబా మరణం కేంద్ర ప్రభుత్వ హత్యేనని ప్రజా గాయకుడు, పర్యావరణ కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు మజ్జి దేవిశ్రీ ఆరోపించారు. సాయిబాబా మృతికి సంతాపంగా జీవీఎంసీ గాంధీపార్కులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తొలుత సాయిబాబా ఉద్యమ స్ఫూర్తిపై పలు గీతాలను ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా జీవితకాలం నమ్మిన సిద్ధాంతాల కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేశారని కొనియాడారు. కేంద్రప్రభుత్వం అకారణంగా పదేళ్లు ఆయనను జైలు జీవితం అనుభవించేలా చేసిందని ఆక్షేపించారు. న్యాయస్థానం ఆయనను నిర్దోషిగా విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకే ఇది కేంద్ర ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి, పాటల తూటా ఉదయ భాస్కర్ మాట్లాడుతూ, సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన ప్రొఫెసర్ సాయిబాబా అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్రప్రభుత్వాన్ని గడగడలాడించిన చరిత్రను మర్చిపోరాదన్నారు. కార్యక్రమంలో పర్యావరణ కళా మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొయ్య రామకృష్ణ యాదవ్ శ్రీనివాస్, జీవ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాల వీరాంజనేయస్వామి



మహారాణిపేట: జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామిని నియమిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ వీరాంజనేయ స్వామి 1997లో ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదివారు. ప్రకాశం జిల్లా కొండపి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన బుధవారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు, 11 గంటల నుంచి 3, 4వ సంఘ సమావేశాలు, 12 గంటల నుంచి 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

మహిళా కళాశాలలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్స్

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు ఈ నెల 17 నుంచి 21 వరకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, ఎమ్‌కామ్, ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లిష్, సైకాలజీ కోర్సులకు సంబంధించి ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

రేపు నీతి ఆయోగ్ సీఈవో రాక

మహారాణిపేట: నీతి ఆయోగ్ ఇండియా ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఈనెల 17న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో రాత్రి 10.15 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 18వ తేదీన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ రోజు రాత్రి 11.10 గంటలకు తిరిగి ఢిల్లీ వెళ్తారు.

182 మంది లైసెన్స్ రద్దుకు సిఫార్సు

బీచ్‌రోడ్డు: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లఘించిన 182 మంది లైసెన్సులను రద్దు చేయాలని ఆర్టీవోకు మూడో పట్టణ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు సిఫార్సు చేశారు. మంగళవారం సిరిపురం, బీచ్‌రోడ్డు, రామ్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో హెల్మెట్ లేకుండా పట్టుబడ్డ వాహనదారులకు జరిమానా విధించడంతో పాటు లైసెన్స్ రద్దు చేయాలని సిఫార్స్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఏయూ భూముల్లో

దివాళీ దందా

స్టాళ్ల పేరిట దోపిడీకి తెరతీసిన కూటమి నేతలు

- టీడీపీ ఎమ్మెల్యే అనుచరగణానికి ఏయూ అధికారులు సాష్టాంగం
- వారి అడ్డగోలు వ్యాపారాలకు సహాయ, సహకారాలు
- రూ.18 లక్షల లీజుకు వర్సిటీ భూములు
- 250 మందుగుండు సామగ్రి స్టాళ్ల ఏర్పాటుకు నేతల ప్రణాళిక
- ఒక్కో స్టాల్‌కు రూ.లక్ష చొప్పున రూ.2.5 కోట్లు వసూలు
- జనసేన ఎమ్మెల్యేకు ఇందులో 40 షాపుల వాటా ?



విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ భూముల్లో కూటమి నేతలు దందాకు తెరలేపారు. ఏయూకు కొసరు వేసి.. అసలు మింగేసే ప్లాన్ వేశారు. మందుగుండు సామగ్రి విక్రయ స్టాళ్ల ఏర్పాటు పేరుతో విశ్వవిద్యాలయానికి రూ.లక్షలు ఇచ్చి.. వ్యాపారుల నుంచి రూ.కోట్లు వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అనుచరగణానికి ఏయూ అధికారులు సైతం సహాయ సహకారాలు అందించడం గమనార్హం. స్టాళ్ల ఏర్పాటుకు ఏయూ స్థలం లీజుకు ఇవ్వాలంటూ ఇచ్చిన ప్రతిపాదన లేఖపై అధికారులు ఆగమేఘాల మీద సంతకాలు చేసి అనుమతులు మంజూరు చేసేశారు.

'దివాళీ ట్రేడ్ ఫెయిర్' పేరుతో..

దీపావళికి ముందే కాసుల పండుగ చేసుకోవాలని టీడీపీ వార్డు స్థాయి నాయకులు ప్లాన్ చేసుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరులైన 17వ వార్డు టీడీపీ నేత, బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధి.. ఇలా కొంత మంది గ్యాంగ్ సరికొత్త ఎత్తుగడ వేశారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ హెలీప్యాడ్ గ్రౌండ్‌లో దీపావళి సందర్భంగా మందుగుండు సామగ్రి స్టాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం దివాళీ ట్రేడ్ ఫెయిర్ పేరుతో స్టాళ్ల ఏర్పాటుకు లీజుకు ఏయూ స్థలాన్ని కేటాయించాలని ఒక అసోసియేషన్‌ను ముందు పెట్టి లేఖ ఇచ్చారు. ఈ నెల 26 నుంచి 28 వరకు స్టాళ్ల ఏర్పాటుకు, 29 నుంచి 31 వరకు మందుగుండు సామగ్రి విక్రయాలకు, నవంబర్ 1వ తేదీన స్టాళ్ల తొలగింపునకు.. ఇలా 8 రోజుల పాటు ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ హెలీప్యాడ్ స్థలాన్ని ఇవ్వాలని కోరారు. దీనికి కూటమి ప్రజాప్రతినిధుల నుంచి పెద్ద ఎత్తున సిఫార్సులు రావడంతో ఏయూ అధికారులు సైతం వెంటనే లీజుకు ఇస్తూ అనుమతులు మంజూరు చేసేశారు. ఇందుకు గాను సదరు అసోసియేషన్ పేరు మీద ఏయూకు రూ.18 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు.

స్టాల్‌కు రూ.లక్ష వసూలు

ఏయూ నుంచి కేవలం రూ.18 లక్షలకు స్థలాన్ని లీజుకు తీసుకున్న ఎమ్మెల్యే అనుచరులు.. ఇందులో స్టాళ్లు ఏర్పాటు చేసి రూ.కోట్లు రాబట్టుకోవాలని భావిస్తున్నారు. ఈ స్థలంలో 250 వరకు స్టాళ్ల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ఒక్కో స్టాల్‌కు రూ.లక్ష వరకు వ్యాపారుల నుంచి డిమాండ్ చేస్తున్నారు. మందుగుండు సామగ్రి విక్రయాలకు మాత్రమే కాకుండా ఫుడ్, ఇతర వ్యాపా రాలకు కూడా స్టాళ్లు కేటాయించేందుకు సిద్ధమవుతున్నారు. దీని ద్వారా ఈ దీపావళికి రూ.2.5 కోట్లు గడించాలని ప్లాన్ చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి జీవీఎంసీ, పోలీస్, ఫైర్ అనుమతుల విషయంలో కూడా ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రతి ఏటా ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో మందుగుండు సామగ్రి స్టాళ్లు ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. గత ఏడాది వరకు వ్యాపారులు నామమాత్రం రుసుముతోనే ఈ స్టాళ్లలో విక్రయాలు చేసేవారు. ఈసారి టీడీపీ నేతలు ధన దాహంతో భారీగా దోచుకోవాలని చూస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. స్టాల్‌కే రూ.లక్ష డిమాండ్ చేస్తుండడం పట్ల పలువురు పెదవి విరుస్తున్నారు.



జనసేన ఎమ్మెల్యేకు వాటా..

ఈ దందాలో జనసేన ఎమ్మెల్యేకు కూడా వాటా ఉన్నట్లు సమాచారం. మొత్తం 250 స్టాళ్లలో 40 వరకు జనసేన ఎమ్మెల్యేకు ఇవ్వాలని ఒప్పందం వచ్చినట్లు వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది. వీటిని సదరు ఎమ్మెల్యే తమ అనుచరుల ద్వారా వ్యాపారులకు అద్దెకు ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఒకవైపు టీడీపీ, మరోవైపు జనసేన ఎమ్మెల్యేల అనుచరులు.. ఏయూ భూముల ద్వారా రూ.కోట్లు గడించడానికి పక్కా స్కెచ్ వేసుకున్నట్లు వ్యాపార వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి.

నైపుణ్య శిక్షణతోనే ఉపాధి అవకాశాలు

- కేంద్ర సహాయ మంత్రి జయంత్ చౌదరి
- నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ప్రారంభం



నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్స్‌టెన్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జయంత్

పెదగంట్యాడ: స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. మండలంలోని ప్రగతి మైదానం వద్దనున్న ఆంధ్రా మెడికల్ టెక్ జోన్(ఏఎంటీజెడ్)ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ మేరకు ఆయనకు మెడిటెక్ మేనేజింగ్ డైరెక్టర్ జితేందర్ శర్మ స్వాగతం పలికారు. మెడ్‌టెక్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆపై నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్స్‌టెన్షన్ సెంటర్ క్రాఫ్ట్స్ ఇన్‌స్ట్రక్టర్ పథకం కింద 2024–25లో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ కింద అధునాతన వృత్తి శిక్షణ, కంప్యూటర్స్‌కు సంబంధించి వివిధ అప్లికేషన్‌లపై పలు రకాల శిక్షణ ఇస్తామన్నారు. ఇందుకు అధునాతన లేబొరేటరీని సిద్ధం చేశామన్నారు. శిక్షణ పొందే వారికి ఉచితంగా భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ముందుగా మెడ్‌టెక్‌లోని మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం మైనపు విగ్రహాన్ని సందర్శించారు. కలాం జయంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మధ్యాహ్న భోజనం బాలేదు

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అసంతృప్తి
- మెరుగుపరచాలని డీఈవోకు ఆదేశాలు
- విద్యార్థుల పఠనా సామర్థ్యాలపై సంతృప్తి
- నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల సందర్శన



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న కలెక్టర్

సీతమ్మధార: 'పులిహోరా ఏంటి ఇలా ఉంది? అన్నం ముద్దగా ఉంది. ఈ భోజనాన్ని పిల్లలు ఎలా తింటారు? పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి.' అని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ మార్చా లని డీఈవో చంద్రకళను కలెక్టర్ ఆదేశించారు. సీతమ్మధార టీపీటీ కాలనీలోని నెహ్రూ మహా నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో 918 మంది చదువుతుండగా.. మంగళవారం 450 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం ఈ పాఠశాలకు అక్షయపాత్ర సంస్థ ఆహారం సరఫరా చేస్తోంది. మెనూలో భాగంగా పులిహోరా, గుడ్డును విద్యార్థులకు అందించారు. చెక్కీలు ఇవ్వలేదు. కాగా.. కొన్నాళ్లుగా ఇక్కడ అందిస్తున్న భోజనం బాగా లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ పాఠశాలను తనిఖీ చేసి.. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. భోజనం నాణ్యత బాగాలేదని.. వెంటనే మెరుగుపరచాలని డీఈవోను ఆదేశించారు.

శభాష్.. ఇంకా బాగా చదవాలి

అంతకుముందు కలెక్టర్ హరేంధిరప్రసాద్ 10వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్‌పై పలు కోణాల్లో ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పఠనా సామర్థ్యాలు, ఆంగ్లంలో సంభాషించిన తీరు, గణితంలో చూపిన ప్రతిభకు కలెక్టర్ మంత్రముగ్ధులయ్యారు. శభాష్.. ఇంకా బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో మెలగాలని, బాధ్యతగా నడుచుకుంటూ ప్రణాళికతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆంగ్లం, హిందీపై పట్టు సాధించాలని చెప్పారు. 10వ తరగతి తర్వాత జరిగే పోటీ పరీక్షల్లో సత్తా చాటాలని సూచించారు. విద్యార్థుల్లోని ఆసక్తిని గమనించిన కలెక్టర్.. చదివిన అంశాలను సులభంగా అర్థం చేసుకునేలా, దీర్ఘకాలం గుర్తుపెట్టుకునేలా మెలకువలు నేర్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

అధ్యయనం పేరుతో దోపిడీ?

- ఈ నెల 20 నుంచి జీవీఎంసీ కార్పొరేటర్ల అధ్యయన యాత్ర
- గతంలో కంటే ఒక్కొక్కరిపై అదనంగా రూ.24 వేల ఖర్చు
- సొమ్ము ప్రజలది.. సోకు కార్పొరేటర్లది అంటూ విమర్శలు



డాబాగార్డెన్స్: అధ్యయన యాత్ర పేరుతో జీవీఎంసీ కార్పొరేటర్లు విలాస యాత్రకు సిద్ధమైపోయారు. ఈ నెల 20న టూర్‌కు బయలుదేరనున్నారు. 8 రోజుల పాటు బెంగళూరు, మైసూరు, బందీపూర్, ఊటీ, పనాజీ తదితర ప్రాంతాలను సందర్శించనున్నారు. అక్కడ స్టార్ హోటళ్లలో బస, లగ్జరీ బస్సుల్లో విహార యాత్ర చేయనున్నారు. ఆయా ప్రాంతాల్లో పర్యాటక ప్రాంతాలు, అభివృద్ధి ప్రాజెక్టులను సందర్శించనున్నారు. ఆధునిక మురుగునీటి నిర్వహణ, మంచినీటి సరఫరా తదితర కార్యక్రమాలను పరిశీలించనున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, కొత్త ప్రాజెక్ట్‌ల రూపకల్పన కోసం గతంలో కార్పొరేటర్లు అధ్యయన యాత్ర పేరుతో పలు రాష్ట్రాలను సందర్శించారు. అయితే ఈ సారి చేస్తున్న అధ్యయన యాత్రపై మాత్రం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెరిగిన ఖర్చు.. తగ్గిన రోజులు

గతంలో అధ్యయన యాత్రకు ఒక్కొక్కరికీ రూ.95 వేలు వరకు వెచ్చించగా.. ఇప్పుడు రూ.24 వేలు అదనంగా జోడించి మొత్తంగా రూ.1.19 లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. దీని ప్రకారం దాదాపు రూ.1.16 కోట్ల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. కేవలం ముందస్తు అనుమతులు పేరుతో ఇందుకు సంబంధించి ఇటీవలే టెండర్ల ప్రక్రియను సైతం పూర్తి చేశారు. గతంలో 12 రోజులు అధ్యయన యాత్ర చేస్తే.. ప్రస్తుత యాత్ర కేవలం 8 రోజులు మాత్రమే. రోజులు తగ్గినప్పటికీ.. ఖర్చు మాత్రం పెరగడం గమనార్హం. మిగిలిన సొమ్ము దోచుకునేందుకు కూటమి కార్పొరేటర్లు స్కెచ్ వేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నగరంలో సోలార్ విద్యుద్దీపాల ఏర్పాటు, వాణిజ్య సముదాయాలతో అతిథి గృహాల నిర్మాణాల బడ్జెట్‌లో కోతలు పెట్టాలని కౌన్సిల్‌లో డిమాండ్ చేసిన కార్పొరేటర్లు.. విహార యాత్రకు ఇంత మొత్తం కుమ్మరించడంపై మండిపడుతున్నారు. స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడే నిర్ణయాలు తీసుకోకూడదని ప్రభుత్వ ఆదేశాలను సాకుగా చూపించి.. జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపును పక్కన పెట్టారు. కార్పొరేటర్ల విహార యాత్రకు మాత్రం ప్రజల సొమ్మును వెచ్చించడం ఇప్పుడు జీవీఎంసీలో చర్చనీయాంశమైంది.

కౌన్సిల్ ఆమోదం లేకుండా నిర్ణయం!

జీవీఎంసీ పరిధిలో ఏదైనా టెండర్లు, పనులకు సంబంధించి స్థాయీ సంఘం, కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ టూర్ విషయంలో మాత్రం ఆ నిబంధనలను గాలికొదిలేశారు. కేవలం ముందస్తు అనుమతులు పేరుతో మేయర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేలా చేశారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా మేయర్ ముందస్తు అనుమతులు ఇచ్చిన పనులపై ఇటీవల జరిగిన కౌన్సిల్‌లో కూటమి కార్పొరేటర్లు నోరేసుకుని పడిపోయారు. కానీ ఈ విహారయాత్రకు మాత్రం ఇదే తరహాలో అనుమతి పొంది టూర్‌కు సిద్ధమైపోయారు. అభివృద్ధి పనులకు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల విషయంలో కోతలు విధిస్తున్న కార్పొరేటర్లు, ఉన్నతాధికారులు.. ఇటువంటి విహార యాత్రల పేరుతో జీవీఎంసీ ఖజానాకు తూట్లు పొడవడం పట్ల వామపక్ష కార్పొరేటర్లు మండిపడుతున్నారు.

కొత్త యాప్‌తో చిక్కులు

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు కొత్త యాప్ రూపకల్పన
- ఆక్రమిత భూముల వివరాలు అప్‌లోడ్ చేయాలని వీఆర్వోలకు ఆదేశాలు
- వారం రోజుల్లో ఆక్రమణదారులకు నోటీసుల జారీ
- ఈ ప్రక్రియతో ఆక్రమణదారులకే లబ్ధి అంటూ విమర్శలు



కలెక్టరేట్ ప్రాంగణం

మహారాణిపేట: భూ ఆక్రమణల యాప్ రెవెన్యూ అధికారులకు కొత్త చిక్కులు తీసుకొచ్చేలా ఉంది. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రూపొందించిన ఈ యాప్‌తో ఆక్రమణదారులకు హక్కులు కల్పించే అవకాశాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఆక్రమణల తొలగింపు ప్రక్రియను మరింత కఠినతరం చేయడంతో పాటు కోర్టు కేసులు కూడా వెంటాడే పరిస్థితులు ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం జిల్లా యంత్రాంగం ఇటీవల ఒక యాప్‌ను తీసుకొచ్చింది. ప్రతీ వీఆర్వో తన పరిధిలో ఆక్రమిత ప్రభుత్వ భూముల వివరాలను తప్పనిసరిగా ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫొటో, ఆక్రమణదారుడి వివరాలు, సర్వే నంబర్, ఇతర వివరాలు ఇందులో నమోదు చేస్తే.. ఆటోమేటిక్‌గా ఆక్రమణదారుడికి నోటీసు సిద్ధమవుతుంది. ఈ నోటీసును సంబంధిత వీఆర్వో వారం రోజుల్లోగా ఆక్రమణదారుడికి అందజేయాలి. 15 రోజుల తర్వాత మరోసారి నోటీసు జారీ చేసి.. దానిపై ఆక్రమణదారుడి నుంచి వివరణ తీసుకోవాలి. వారి వివరణ సంతృప్తిగా లేదని భావిస్తే నాలుగు రోజుల్లో ఆ నిర్మాణాలు తొలగించాలి. ఈ ఉద్దేశంతోనే ఈ యాప్‌ను అధికారులు రూపొందించారు. ఈ మేరకు జిల్లాలోని అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను ఈ యాప్‌లో నమోదు చేసే పనిలో వీఆర్వోలు నిమగ్నమయ్యారు. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. గ్రేడ్-1, గ్రేడ్-2, సచివాలయం వీఆర్వోలు మొత్తం 336 మంది ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. 10 రోజుల వ్యవధిలో ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్న నిబంధన కూడా ఉంది. అయితే ఈ కార్యక్రమం ఆక్రమణదారుడికి లబ్ధి చేకూర్చేలా ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

గ్రామ/వార్డు సర్వేయర్లు ఎక్కడ?

భూమి సరిహద్దులను కచ్చితంగా నిర్ణయించడంలో సర్వేయర్ల పాత్ర కీలకం. ప్రభుత్వ భూముల కోసం వీఆర్వోతోపాటు సర్వేయర్‌కు పూర్తి అవగాహన ఉంటుంది. ఒక్క వీఆర్వో వల్ల పెద్దగా ప్రయోజనం ఉండే అవకాశం లేదు. అంతేకాకుండా వీఆర్వో ఈ సమాచారాన్ని ఆక్రమణదారుడికి ఇచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం, సచివాలయాల్లో సర్వేయర్లు అందుబాటులో ఉన్నారు. కానీ ఈ ప్రక్రియలో సర్వేయర్లను పూర్తిగా పరిగణలోకి తీసుకోలేదు.

గతంలో ఇలాంటి పద్ధతి ఉందా?

ప్రభుత్వ భూముల ఆక్రమణ ఎక్కడో ఓ చోట నిత్యం జరుగుతూనే ఉంటుంది. ఇప్పటివరకు ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా నేరుగా తొలగిస్తున్నారు. అడంగల్‌లో గానీ ఇతర రెవెన్యూ రికార్డుల్లో ఆక్రమణదారుడి పేరు నమోదు చేసే పరిస్థితి ఎప్పుడూ లేదు. కానీ ఈ కొత్త పద్ధతి వల్ల ఆక్రమణదారులకు చాలా అవకాశాలు కల్పించినట్లవుతుందని పలువురు అంటున్నారు.

నోటీసులతో ఆక్రమణదారుడికే లబ్ధి?

ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేయడం వల్ల.. వారికే లబ్ధి చేకూరే పరిస్థితి ఉంది. ఈ నోటీసులతో వారు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. తద్వారా ఆక్రమణదారుడికి చేతికి మరో అవకాశం కల్పించినట్లు అవుతుంది. దీంతో ఆక్రమణలను తొలగించడం కష్టతరంగా మారుతుంది.

ఏం చేయాలి?

ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఈ యాప్ మంచి ప్రయత్నమే కానీ.. యాప్‌లోని కొన్ని లోపాలను సరిచేయడం చాలా ముఖ్యం. అప్పుడే ఈ యాప్ ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. 'ప్రతి వీఆర్వోకు ఒక సర్వేయర్‌ను కేటాయించి, భూమి సరిహద్దులను కచ్చితంగా నిర్ణయించే బాధ్యతను అప్పగించాలి. నోటీసుల కాలవ్యవధి, వివరణ కోరే విధానం తదితర అంశాలపై పునఃసమీక్ష చేయాలి. ఆక్రమణదారులకు అధిక అవకాశాలు లభించకుండా చూడాలి. ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టవిరుద్ధమని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. రెవెన్యూ, పోలీసు శాఖ, స్థానిక సంస్థల మధ్య సమన్వయం పెంచి, ఆక్రమణలను తొలగించే చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలి.' అని పలువురు సూచిస్తున్నారు.

కన్నకొడుకే కాలయముడు

- తండ్రిని కత్తితో నరికి చంపిన కుమారుడు
- పోలీసుల అదుపులో నిందితుడు



దేముడు మృతదేహం

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. కన్న కొడుకే కాలయముడై తండ్రిని నరికి చంపాడు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నరవ శివారు మనిపాలెంలో ఎంగలి దేముడు(60) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. దసరా నేపథ్యంలో కొద్ది రోజులుగా కుమారుడు గోపితో కలిసి తరచూ మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. ఆ సమయంలో తండ్రీ కొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఇంటికి వచ్చి పడుకున్న తండ్రి గొంతును కత్తితో కొడుకు కోసేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై దేముడు అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. నిందితుడు గోపిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి



కాలువలో పడి ఉన్న అశోక్‌రెడ్డి మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు అశోక్‌రెడ్డి కాలువలో పడి మృతి చెందాడు. సోమవారం సాయంత్రం సంఘటన జరగగా మంగళవారం ఉదయం బయటపడింది. స్టీల్‌ప్లాంట్ పోలీసుల వివరాలు మేరకు.. పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన జి.అశోక్‌రెడ్డి (29) సింటర్ ప్లాంట్‌లో టీఎంసీ కాంట్రాక్టర్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అనారోగ్యం నుంచి కోలుకొని సోమవారం బీ షిఫ్ట్ విధులకు హాజరై రాత్రి 7 గంటల సమయంలో బైక్‌పై బయల్దేరాడు. అక్కడ ఉన్న కల్వర్ట్ పరిసర ప్రాంతం బురదగా ఉండటంతో బైక్ స్కిడ్ అయి పక్క ఉన్న కల్వర్ట్‌లో జారి పడిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. సీఐ కేశవరావు, సిబ్బంది సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించారు. మృతుని శరీరంపై గాయాలున్నట్టు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అశోక్ రెడ్డి తండ్రి స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి. ఏఎస్ఐ త్రినాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సుల సంఘం ఎన్నికకు నేడు నామినేషన్లు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు నర్సుల సంఘాలను ఇటీవల కలిపి ఎన్నికలు నిర్వహిస్తున్న సంగతి విదితమే. కేజీహెచ్ క్లాక్ రూమ్‌లో(ఆంధ్రా బ్యాంక్) బుధవారం ఉదయం 10 నుంచి 4 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందని ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు (అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి) రూ.వెయ్యి చెల్లించాలన్నారు. పాలకవర్గ సభ్యులుగా పోటీ చేసేవారు నామినేషన్ ఫీజు రూ.500లు చెల్లించాలని పేర్కొన్నారు.

సీ.. అద్భుతం!



ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది వేడుకలకు గుర్తుగా కాలేజీ ప్రాంగణంలో 'సీ'ఆకారంలో నిర్మించిన చిహ్నం ఆకట్టుకుంటోంది. వైద్య రంగంలో ఉపయోగిస్తున్న వివిధ వస్తువుల నమూనాలతో రూపొందించిన ఈ చిహ్నం.. కళాశాల గొప్పతనానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ అద్భుత చిహ్నాన్ని దగ్గరగా చూడటానికి, దానితో ఫొటోలు దిగడానికి వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఈ చిహ్నం దగ్గర నుంచి సముద్ర అందాలను చూస్తూ.. తనివితీరా ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పెద్దాస్పత్రికి..నిర్లక్ష్య జబ్బు



సిబ్బంది ఎక్కడ?: పరీక్షల నిమిత్తం వీల్‌చైర్‌లో రోగిని తరలిస్తున్న బంధువు



సాయంత్రం ఆరు గంటలకు కేజీహెచ్ రక్త పరీక్షల కేంద్రం వద్ద రిపోర్టుల కోసం క్యూ కట్టిన రోగుల బంధువులు

ఉత్తరాంధ్రకు పెద్ద దిక్కుగా ఉన్న కేజీహెచ్‌లో సిబ్బంది నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. రోగులను తరలించేందుకు కూడా సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. దీంతో రోగులను వారి బంధువులే వీల్‌చైర్‌లో వివిధ పరీక్షలకు తీసుకువెళుతున్నారు. రోజురోజుకూ కేజీహెచ్‌లో పర్యవేక్షణ కొరవడడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అలాగే రక్త పరీక్షలు నిర్వహించడం, రిపోర్టులు ఇవ్వడంలో కూడా తీవ్ర జాప్యం జరుగుతుండడంతో బాధితులు సహనం కోల్పోతున్నారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్లు, విశాఖపట్నం



ఈక్విటీకి వెళ్లిపోతాం..!

- నష్టాల ఊబిలో కూరుకుపోతున్న డీసీఐ
- 100% వేతనాలు చెల్లింపులకూ కటకట
- చేతులెత్తేస్తున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్
- ఈ ఏడాది తొలి త్రైమాసికంలో రూ.30 కోట్ల నష్టాన్ని చవిచూసిన సంస్థ
- రూ.450 కోట్ల ఈక్విటీలకు వెళ్తామంటూ పోర్టులకు ప్రతిపాదనలు
- ఆర్థిక సాయమందించేందుకు పోర్టు సమాలోచనలు
- ఈక్విటీకి వెళ్లకుండా నిరోధించేందుకు సన్నాహాలు

సాక్షి, విశాఖపట్నం: వరుసగా మూడేళ్ల లాభాల బాటపట్టిన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐఎల్) ఈ ఆర్థికంలో తొలి త్రైమాసికంలోనే ఏకంగా రూ.30 కోట్ల నష్టాల బారినపడింది. దీంతో షేర్ ముఖ విలువ కూడా తగ్గుముఖం పట్టింది. రెండో త్రైమాసికంలోనూ అదే శైలిలో ఫలితాలు కనిపిస్తుండటంతో ఉద్యోగులు, అధికారుల్లో కలవరం మొదలైంది. నష్టాల ఊబిలో కూరుకుపోతూ 100 శాతం జీతాల చెల్లింపులపైనా భారం పడుతుండటంతో ఈక్విటీలకు వెళ్లిపోవాలని భావిస్తున్నారు. రూ.450 కోట్లకు ఈక్విటీలకు వెళ్లేందుకు అనుమతివ్వాలంటూ కన్సార్టియం పోర్టులకు ప్రతిపాదనలు పంపించింది. ఈ ప్రతిపాదనలతో మళ్లీ ప్రైవేటీకరణ అంశం తెరపైకి వస్తుందేమోననే ఆందోళన డీసీఐ ఉద్యోగుల్లో కలకలం రేపుతోంది. ఏడేళ్ల క్రితం డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేసినప్పుడు ఉద్యోగులంతా సంఘటితమై పోరాటం సాగించారు.

వీరి పోరుకు మద్దతుగా విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) నిలిచింది. మరో మూడు పోర్టులతో కలిసి డీసీఐ బాధ్యతను తన భుజస్కందాలకెత్తుకుంది. డీసీఐకు కన్సార్టియంగా విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) 19.47 శాతం, జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు ట్రస్ట్ 18 శాతం, పారాదీప్ పోర్టు ట్రస్ట్ 18 శాతం, దీన్‌దయాళ్ పోర్టు ట్రస్ట్ 18 శాతం వాటాలతో డీసీఐకి బాసటగా నిలిచాయి. దీంతో ప్రైవేటీకరణ నిర్ణయం ఆగిపోయింది. ఆ తర్వాత లాభాల బాటలో పయనించింది. మూడేళ్ల క్రితం ఎండీ, సీఈవో నియమాకంలో అవకతవకలు జరిగిన విషయం వెలుగులోకి రావడం విజిలెన్స్ విచారణ నిర్వహించి ఎండీని తొలగించడం.. తర్వాత ఆయన స్థానంలో వచ్చిన కొత్త ఎండీ పదవీకాలం ముగియడం చకచకా జరిగిపోయింది. ఇక అక్కడ నుంచి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ పతనం మొదలైంది. కొత్త ఎండీ, సీఈవోని ఇంతవరకూ నియమించకుండా పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబేకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించినా ఫలితం మారలేదు.



డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం

రెండో త్రైమాసికంలోనూ నష్టాలేనా.?

2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.31.40 కోట్ల నష్టాల్ని డీసీఐ మూటకట్టుకుంది. 2023-24 తొలి త్రైమాసికంలో రూ.15.15 కోట్ల నికరలాభాలను ఆర్జించిన డీసీఐ ఆదిలోనే 300 శాతం నష్టాలను చవి చూసింది. అదేవిధంగా గతేడాది తొలి త్రైమాసికంలో రూ.204.51 కోట్లు ఆదాయం రాగా ఈసారి మాత్రం కేవలం రూ.150.80 కోట్లు మాత్రమే ఆర్జించింది. డ్రైడాక్‌ల రిపేర్లు, ఆరు వరకూ డ్రెడ్జర్ల అత్యవసర మరమ్మతు పనులు నిర్వహించడమే నికరలాభాలను ఆర్జించకపోవడానికి కారణమని అధికారులు తప్పుల్ని కప్పిపుచ్చుకునేందుకు యత్నిస్తున్నారు. దీంతోపాటు షేర్ ముఖ విలువ కూడా దారుణంగా పడిపోయింది. గతేడాది డీసీఐ షేరు ముఖ విలువపై రూ.5.41 ఆదాయం ఉండగా.. ఈసారి ప్రస్తుతం షేర్ విలువపై రూ.-11.22 నష్టం చవిచూస్తున్నారు. దీంతో డీసీఐపై మదుపరుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ఫలితంగా నష్టాలు మరింత చుట్టుముడుతున్నాయి. రెండో త్రైమాసికంలోనూ నష్టాలే ఎదురయ్యేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫలితంగా డీసీఐ ఖజానా పూర్తిగా ఖాళీ అయిపోతోంది.

ఏడాదిలోనే కుదేలు

గతేడాది వరకూ అద్భుతంగా సాగిన డీసీఐ పయనం.. మళ్లీ కుదేలయ్యే స్థితికి చేరుకున్న నేపథ్యంలో దిక్కుతోచని స్థితిలో అధికారులు సొంత నిర్ణయాలు అమలు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికిప్పుడు కనీసం రూ.450 కోట్లు వరకూ సమీకరిస్తే తప్ప డీసీఐ కోలుకోలేని స్థితిలో ఉంది. జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితులకు దిగజారే స్థితిలో ఈక్విటీకి వెళ్లడమే శరణ్యమని భావిస్తున్నారు. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)కి వెళ్తూ రూ.450 కోట్లకు ఈక్విటీని ఆఫర్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే కన్సార్టియం పరిధిలో ఉన్న నేపథ్యంలో సొంత నిర్ణయం తీసుకోలేని పరిస్థితులుండటంతో పెద్దన్నగా వ్యవహరిస్తున్న విశాఖ పోర్టుకు ప్రతిపాదనల ఫైలుని పంపించారు. అయితే ప్రస్తుతం డీసీఐ ఎండీగా వ్యవహరిస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దూబే మాత్రం ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించాలని అధికారులను సూచించినట్లు తెలుస్తోంది. ఎలాగైనా పోర్టు నుంచి నిధులు సమీకరించి.. ఆదుకునేందుకు ప్రయత్నాలు చేస్తానని భరోసా ఇచ్చినట్లు సమాచారం. కనీసం రూ.400 కోట్‌లైనా తీసుకొచ్చి డీసీఐని కొంత మేర గట్టెక్కించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ ప్రయత్నాలు విఫలమైతే తమ పరిస్థితేంటోననే ఆందోళనలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఉద్యోగ వర్గాలు కలవరపడుతున్నాయి.

కి'లేడి'పై మరో ఫిర్యాదు

ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

అల్లిపురం: కి'లేడి'కొరుప్రోలు జాయ్ జమీమా లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. డబ్బున్న యువకులను ఎంచుకుని.. వారితో సన్నిహితంగా గడుపుతూ ఫొటోలు తీసి బెదిరింపులకు పాల్పడుతున్న ఆమెపై తాజాగా ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. హైదరాబాద్‌కు చెందిన యువకుడు 2022 జనవరి నుంచి నగరంలోని ఒక కంపెనీలో పని చేస్తున్నాడు. ఆ కంపెనీకి చెందిన యజమాని కుటుంబ బంధువుగా, కంపెనీ హెడ్‌గా జమీమా అతనితో పరిచయం పెంచుకుంది. ఆ కంపెనీలో ఏదో మాయ చేసి కొద్ది రోజులకు అతనికి రాత్రి డ్యూటీలు వేయించింది. ఆ సమయంలో డిన్నర్ తెచ్చి అతనితో తినడం, క్యారెట్, ఆరెంజ్ జ్యూస్ తాగించేది. ఈ క్రమంలో మేలో బాధితుడు తాను హైదరాబాద్ వెళ్లిపోతానని చెప్పడంతో.. అతనితో సన్నిహితంగా ఉన్న ఫొటోలను, వీడియోలు చూపించి బెదిరింపులకు పాల్పడింది. తర్వాత తన ఖాతాకు దఫదఫాలుగా రూ.6లక్షలు బదిలీ చేయించుకుంది. నగరంలో అపార్టుమెంట్ అద్దెకు తీయించి అందులోకి కావాల్సిన ఫర్నిచర్ కొనిపించింది. బాధితుడు హైదరాబాద్ వెళ్లిన ప్రతీ సారి ఆత్మహత్య చేసుకుంటానని వీడియోకాల్ చేసి బెదిరించేది. కాగా.. బాధితుడు తన ఆరోగ్యం బాలేదని హైదరాబాద్‌లోనే ఉండిపోయాడు. అక్కడికి వెళ్లిన జమీమా.. హైదరాబాద్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని రూ.10 లక్షలతో ఫర్నిచర్ కొనిపించింది. తిరిగి మళ్లీ విశాఖ వచ్చిన తర్వాత మరో ఇల్లు అద్దెకు తీసుకుని మరో రూ.6 లక్షలతో ఫర్నిచర్ కొనుగోలు చేయించింది. బాధితుడు ఇకనైనా తనను వదిలి పెట్టమని వేడుకోగా రూ.3 కోట్లు ఇస్తే సెటిల్‌మెంట్‌కు వస్తానని చెప్పింది. దీంతో బాధితుడు తన స్నేహితుడితో చెప్పి ఇస్తానని చెప్పాడు. కానీ ఆమె అతడిని నమ్మలేదు. పారిపోతాడని గదిలో పెట్టి వారం రోజుల పాటు భోజనం పెట్టకుండా పానీయాలు మాత్రమే ఇచ్చి వేధించింది. ఎట్టకేలకు బాధితుడు రూ.3 కోట్లు ఇస్తానని నమ్మించి బంగారం, ల్యాప్‌టాప్, రూ.3 లక్షల నగదు తీసుకుని కారులో హైదరాబాద్ బయలుదేరారు. మార్గమధ్యలో కొందరు కారును ఆపి బలవంతంగా లోపలికి చొరబడ్డారు. నిర్మానుష్య ప్రాంతంలో బాధితుడిని జమీమా కత్తితో బెదిరించి బంగారం, ల్యాప్‌టాప్, నగదు దోచేందుకునేందుకు ప్రయత్నించగా.. అతను కారు నుంచి దూకి వారి నుంచి తప్పించుకున్నాడు. ప్రాణభయం, కుటుంబ గౌరవం కారణంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అయితే జమీమా ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో అతనిపై మిస్సింగ్ కేసు, లైంగిక వేధింపుల కేసు పెట్టింది. ఈ క్రమంలో బాధితుడు స్టేషన్‌కు వచ్చి బెయిల్ తీసుకున్నాడు. ఎన్ఆర్ఐ యువకుడిని మోసం చేసిన కేసులో భీమిలి పోలీసులు ఆమెను అరెస్ట్ చేయడంతో బాధితుడు తనకు జరిగిన మోసంపై ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన నుంచి కోటి రూపాయల వరకు దోచుకుందని తెలిపాడు. జమీమాపై కేసు నమోదు చేసి.. ఆమె అనుచరుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కురిసింది వాన



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం నగరంలోని పలు చోట్ల వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షం నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం నుంచి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. అల్పపీడనం, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం